

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి శనివారం 04-07-2026 సంపుటి : 08 సంచిక 23 పేజీలు : 8 వెల : రూ 3-00

# రాయలసీమ స్టీల్ ప్లాంట్ పనులు ప్రారంభం



## రూ.16,350 కోట్ల పెట్టుబడితో రెండు దశల్లో ఉక్కు పరిశ్రమ నిర్మాణం

కడప జూలై 3,రాయలసీమ ప్రజల దశాబ్దాల ఉక్కు కలను సాకారం చేసే దిశగా కీలక ముందడుగు పడింది. కడప జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గంలోని సున్నపురాళ్లపల్లి వద్ద జేఎస్‌డబ్ల్యూ రాయలసీమ స్టీల్ లిమిటెడ్ నిర్మాణ పనులను ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి శ్రీనివాసవర్మ, జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ అధినేత సజ్జన్ జిందాల్‌తో కలిసి ఆయన కాంక్రీట్ వేసి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు గొట్టిపాటి రవికుమార్, సవిత, ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పాల్గొన్నారు.ఈ ప్రాజెక్టును రెండు దశల్లో మొత్తం రూ.16,350 కోట్ల భారీ పెట్టుబడితో నిర్మించనున్నారు. తొలిదశ పూర్తయ్యేసరికి ఏడాదికి 2 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి సామర్థ్యాన్ని ఇది కలిగి ఉంటుంది. ఈ స్టీల్ ప్లాంట్‌తో పాటు, దీనికి అనుబంధంగా జేఎస్‌డబ్ల్యూ నియో ఎనర్జీ సోలార్ క్యాప్టివ్ పవరప్రాజెక్టు పనులను కూడా ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ రెండు ప్రాజెక్టుల ద్వారా ప్రత్యక్షంగా 2,700 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ఇదే కాకుండా, రాష్ట్రంలో 3,850 మెగావాట్ల సౌర, పవన విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు మరో రూ.20,350 కోట్లు పెట్టుబడిగా పెట్టేందుకు జేఎస్‌డబ్ల్యూ సంస్థ ముందుకొచ్చింది.ఈ కార్యక్రమం నుంచే ముఖ్యమంత్రి చంద్రబాబు విజయనగరం జిల్లాలో జేఎస్‌డబ్ల్యూ సంస్థ ఏర్పాటు చేసిన పారిశ్రామిక పార్కును వర్చువల్‌గా ప్రారంభించారు. రూ.531 కోట్ల పెట్టుబడితో 1166 ఎకరాల్లో ఈ పార్కును అత్యాధునిక వసతులతో, ప్లగ్ అండ్ ప్లే విధానంలో అభివృద్ధి చేశారు.అంతకుముందు, స్టీల్ ప్లాంట్ వద్ద ఏర్పాటు చేసిన ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను సీఎం చంద్రబాబు ఆసక్తిగా పరిశీలించారు. స్టీల్ ప్లాంట్ మినియేచర్ మోడల్, నియో ఎనర్జీ ప్లాంట్ వివరాలను సజ్జన్ జిందాల్ ఆయనకు వివరించారు. హైదరాబాద్‌లో జేఎస్‌డబ్ల్యూ తయారుచేస్తున్న డిఫెన్స్ డ్రోన్ షీల్డ్ ఏఐ టెక్నాలజీ గురించి సీఎం ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు. రక్షణ, పౌర అవసరాలకు డ్రోన్ల తయారీపై దృష్టి సారించాలని, కర్నూలులో ఏర్పాటు చేస్తున్న డ్రోన్ సిటీలోని వసతులను వినియోగించుకోవాలని ఆయన సూచించారు. విపత్తుల సమయంలో వినియోగించే ప్రత్యేక వాహనాలను కూడా ఆయన పరిశీలించారు.దాదాపు రూ.16,350 కోట్ల భారీ బడ్జెట్‌తో కడప స్టీల్ ప్లాంట్‌ను నిర్మిస్తున్నారు.పర్యావరణ పరిరక్షణకు ఏపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తూ ఈ స్టీల్ ప్లాంటులో అత్యాధునిక ఎలక్ట్రిక్ ఆర్క్ ఫర్నేస్ (ఇంఈ) టెక్నాలజీని వినియోగిస్తున్నారు. దీనివల్ల పర్యావరణానికి హాని కలిగించే కార్బన్ ఉద్గారాలు భారీ స్థాయిలో తగ్గి, పర్యావరణహితమైన గ్రీన్ స్టీల్ ఉత్పత్తి అవుతుందని అధికారులు తెలిపారు. ఈ తరహా అత్యాధునిక ప్లాంట్ భారత్‌లోనే మొట్టమొదటిదని జేఎస్‌డబ్ల్యూ పరిశ్రమ వర్గాలు తెలిపాయి. దీనికి తోడుగా, పరిశ్రమ అవసరాల కోసం 2,400 ఎకరాల్లో 400 మెగావాట్ల సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టులను జేఎస్‌డబ్ల్యూ నియో ఎనర్జీ సంస్థ నిర్మిస్తోంది. ఉక్కు పరిశ్రమతో పాటు ఈ గ్రీన్ ఎనర్జీ ప్లాంట్లకు కూడా సీఎం చంద్రబాబు శుక్రవారం శంకుస్థాపన చేశారు.కడప స్టీల్ ప్లాంట్ ఏర్పాటు ప్రస్థానంలో ఎన్నో మలుపులు చోటుచేసుకున్నాయి. 2019లో తొలి ప్రతిపాదనలు రాగా.. 2025లో జేఎస్‌డబ్ల్యూ సంస్థ నివేదికలకు రాష్ట్ర మంత్రివర్గం, ఎస్ఐపీబీ (రాఎఖః) గ్రీన్ సిగ్నల్ ఇచ్చాయి. అనంతరం గత మార్చి 25న 1,100 ఎకరాల భూమిని సంస్థకు అధికారికంగా అప్పగించడంతో పనులు ఊపందుకున్నాయి. ఈ భారీ పరిశ్రమ ఏర్పాటుతో రాయలసీమలోని స్థానిక ఎంఎస్‌ఎంఈలకు, రవాణా రంగానికి కొత్త ఉపాధి అవకాశాలు లభించి భారీ ఊపు రానుంది.జేఎస్‌డబ్ల్యూ రాయలసీమ స్టీల్ ప్లాంట్ ద్వారా 2,500 మందికి ప్రత్యక్షంగా, మరో 5,000 మందికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయి. మొత్తం 1,100 ఎకరాల విస్తీర్ణంలో రెండు దశల్లో ఈ ప్లాంటు నిర్మాణం పూర్తి చేయనున్నారు. మొదటి దశలో రూ. 4,800 కోట్ల పెట్టుబడితో పనులను చేపట్టి, 2028 ఏప్రిల్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఏపీ ప్రభుత్వం తెలిపింది. ఆ తర్వాత రెండో దశలో రూ. 11,850 కోట్ల భారీ వ్యయంతో ఈ ప్రాజెక్టును పూర్తి చేయనున్నారు.వైఎస్సార్ హయాం నుండి జగన్ పాలన వరకు.. ప్లాంట్ ప్రస్థానంకడపలో స్టీలు ప్లాంటు ఏర్పాటుకు దివంగత సీఎం వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలోనే మొదలైంది. 2007లో బ్రహ్మణి స్టీల్స్‌కు వైఎస్సార్ శంకుస్థాపన చేశారు. అయితే వైఎస్సార్ అకాల మరణం, ఓబులాపురం మైనింగ్ కేసులో గాలి జనార్ధనరెడ్డి జైలుకు వెళ్లడంతో నాటి కాంగ్రెస్ సర్కార్ బ్రహ్మణి స్టీల్స్ ఒప్పందాన్ని రద్దు చేసింది. రాష్ట్ర విభజన అనంతరం నవ్యాంధ్ర తొలి ముఖ్యమంత్రిగా చంద్రబాబు 2018 డిసెంబరు 28న జమ్మలమడుగు నియోజకవర్గం మైలవరం మండలం కంబాలదిన్నెలో 'రాయలసీమ స్టీలు కార్పొరేషన్' పనులకు శంకుస్థాపన చేశారు. కానీ, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్ పాత ప్రాజెక్టును పక్కనపెట్టారు. 2019 డిసెంబరులో సున్నపురాళ్లపల్లె వద్ద వైఎస్ఆర్ స్టీలు ప్లాంటు కార్పొరేషన్ పేరిట జేఎస్‌డబ్ల్యూ సంస్థతో కలిసి శంకుస్థాపన చేశారు. గత ఏడాది కడపలో నిర్వహించిన మహానాడు వేదికగా టీడీపీ అధినేత చంద్రబాబు జిల్లా ప్రజలకు ఒక కీలక హామీ ఇచ్చారు. కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ నిర్మాణాన్ని ఖచ్చితంగా పూర్తి చేస్తామన్నారు. ఇచ్చిన మాట ప్రకారమే ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో రాయలసీమ స్టీల్ ప్లాంట్ పనులకు శుక్రవారం నాడు సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారు. నిర్ణీత షెడ్యూల్ ప్రకారం పనులు పూర్తి చేస్తామని.. దీని ద్వారా 3000 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. మోదీకి చంద్రబాబు వంటి నేతలు తోడైతే దేశం వేగంగా అభివృద్ధి చెందుతుంది: సజ్జన్ జిందాల్ ముఖ్యమంత్రి చంద్రబాబు లాంటి దార్శనికత ఉన్న నాయకులు దేశంలో చాలా అరుదుగా ఉంటారని, ఆయన వచ్చే 25 ఏళ్ల అభివృద్ధిని ముందుగానే ఆలోచించి అమలు చేస్తారని జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ అధినేత సజ్జన్ జిందాల్ ప్రశంసించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు విజన్ వల్లే సైబరాబాద్ నగరం ప్రపంచ స్థాయి ఐటీ హబ్‌గా ఎదిగిందని ఆయన గుర్తుచేశారు.

# అమర్‌నాథ్ యాత్రికులకు ప్రధాని శుభాకాంక్షలు..



## 'ఐదు సంకల్పాలు' స్వీకరించాలని పిలుపు

ఢిల్లీ, జూలై 3: జమ్మూ– కశ్మీర్‌లో నుంచి ప్రారంభమైన వార్షిక అమర్‌నాథ్ యాత్రను పురస్కరించుకుని ప్రధాని నరేంద్ర మోదీ భక్తులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ పవిత్ర యాత్రను ఒక 'గొప్ప భాగ్యం'గా అభివర్ణించిన ప్రధాని, భక్తిశ్రద్ధలతో, క్రమశిక్షణతో, బాధ్యతాయుతమైన జాతీయ భావనతో భక్తులు ఈ ప్రయాణాన్ని కొనసాగించాలని కోరారు. శివభక్తులను ఉద్దేశించి రాసిన లేఖను ఎక్స్ (టీ) వేదికగా పంచుకుంటూ పీఎం మోదీ పలు కీలక విషయాలను ప్రస్తావించారు.'పవిత్రమైన అమర్‌నాథ్ యాత్రలో పాల్గొనడం ఒక గొప్ప భాగ్యం. ప్రతి సంవత్సరం 'బాబా బర్ఫానీ' (మంచు లింగం)ని నేరుగా దర్శించుకునే ఈ అవకాశం లక్షలాది మంది శివభక్తులకు అత్యంత పవిత్రమైన, మరపురాని అనుభూతిని ఇస్తుంది. ఈ సంవత్సరం యాత్రకు సిద్ధమవుతున్న భక్తులందరికీ నా హృదయపూర్వక శుభాకాంక్షలు.' అని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు.ఈ యాత్ర భారతదేశ ఆధ్యాత్మిక సంప్రదాయంలో ఒక శాశ్వతమైన అధ్యాయమని ప్రధాని కొనియాడారు. ప్రపంచవ్యాప్తంగా సనాతన సంస్కృతిని అనుసరించే లక్షలాది మంది భక్తులు ప్రతి ఏటా బాబా అమర్‌నాథ్ ఆశీస్సుల కోసం జమ్మూ కశ్మీర్‌కు వస్తుంటారని గుర్తుచేశారు. వివిధ ప్రాంతాలు, విభిన్న భాషలు, భిన్నమైన ఆచారాలు ఉన్నప్పటికీ.. మహాదేవుని ఆశీస్సులు పొందాలనే ఒకే ఒక సంకల్పంతో భక్తులంతా ఇక్కడికి తరలివస్తారని, ఈ రెండు నెలల కాలంలో బాబా బర్ఫానీ పవిత్ర సన్నిధిలో భారతదేశ 'భిన్నత్వంలో ఏకత్వం' అనే అద్భుత దృశ్యం ఆవిష్కృతమవుతుందని మోదీ అన్నారు.ఈ యాత్ర సజావుగా సాగడానికి అహర్నిశలు శ్రమిస్తున్న భారత సైన్యం, సీఆర్‌పీఎఫ్, జమ్మూ కశ్మీర్ పోలీస్, ఐటీబీపీ, బీఎస్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బందితో పాటు ఆరోగ్య కార్యకర్తలు, పరిపాలనా అధికారులు, పారిశుద్ధ్య కార్మికులు, వాలంటీర్లకు ప్రధాని మోదీ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

యాత్రికులకు పీఎం మోదీ సూచించిన 'ఐదు సంకల్పాలు'

ఈ ఏడాది యాత్ర సందర్భంగా భక్తులందరూ తమ జీవితంలో ఐదు ముఖ్యమైన సంకల్పాలను స్వీకరించాలని ప్రధాని పిలుపునిచ్చారు.

1. అమర్‌నాథ్ యాత్ర మార్గంలో ఎక్కడా చెత్తాచెదారం వేయకుండా, పరిశుభ్రత నియమాలను తూచా తప్పకుండా పాటించాలి.

2. పరిపాలన నిబంధనలు: వాతావరణ మార్పులు, వర్షాల నేపథ్యంలో జారే మార్గాల పట్ల అప్రమత్తంగా ఉంటూ, పరిపాలనా యంత్రాంగం ఇచ్చే ఆదేశాలను, ట్రాఫిక్ నిబంధనలను, భద్రతా సూచనలను పూర్తిగా అంకితభావంతో పాటించాలి. 3. లోకల్ వస్తువుల కొనుగోలు ( స్థానిక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు, యాత్రికులు తమ ప్రయాణ ఖర్చులలో కనీసం 10 శాతం మొత్తాన్ని జమ్మూ కశ్మీర్‌లోని స్థానిక ఉత్పత్తులను కొనుగోలుకు కేటాయించాలి. ఇది అక్కడి కుటుంబాలకు, యువతకు ఉపాధినిస్తుంది. 4. మొక్కలు నాటడం (ఏక్ పేడ్ మా కే నామ్): రక్షాబంధన్ పండుగతో ముగిసే ఈ యాత్ర ముగింపు సందర్భంగా.. 'ఏక్ పేడ్ మా కే నామ్' (అమ్మ పేరిట ఒక మొక్క) ప్రచారంలో భాగంగా ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటాలి. 5. వికసిత్ భారత్: దేశమే ప్రథమమనే భావనతో, మన బాధ్యతలను ఏడాది పొడవునా నిజాయితీగా నిర్వర్తిస్తూ, 'వికసిత్ భారత్' నిర్మాణంలో చురుకైన పాత్ర పోషించాలి. చివరగా, భక్తులందరి ప్రయాణం సుఖమయంగా, సురక్షితంగా, ఆధ్యాత్మికంగా సాగాలని ఆకాంక్షిస్తూ ప్రధానమంత్రి తన సందేశాన్ని ముగించారు.

# ఏపీ అభివృద్ధికి పరిశ్రమలు, పెట్టుబడులు అవసరం: హోం మంత్రి అనిత

విజయనగరం, జులై 3: ఏపీలో ఇండస్ట్రియల్ పార్కుల నిర్మాణానికి కీలక అడుగు పడింది. జిల్లాలోని శృంగవరపుకోట మండల పరిధిలో ఇండస్ట్రియల్ పార్కుల నిర్మాణానికి కడప జిల్లా జమ్ములమడుగు నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వర్చువల్‌గా భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇన్‌ఛార్జి మంత్రి వంగలపూడి అనిత, మంత్రి కొండపల్లి శ్రీనివాస్, విశాఖపట్నం ఎంపీ శ్రీ భరత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ.. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే పరిశ్రమలు, పెట్టుబడులు రావాలన్నారు. రైతులకు భూమికి ఉన్న సంబంధం – తల్లికి బిడ్డకు ఉన్న సంబంధం లాంటిదని తెలిపారు. ఎన్డీఏ ప్రభుత్వం రైతులకు అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. మొదటి దశలో 535 ఎకరాల్లో ఎంఎస్ఎంఈ పార్కు వస్తుందని చెప్పారు.వివిధ పరిశ్రమల ఏర్పాటు ద్వారా సుమారు 45 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రానున్నాయని మంత్రి వెల్లడించారు.

# మహిళల ఆర్థికాభివృద్ధికి సంఘాల బలోపేతం కీలకం--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 03: మహిళా సంఘాల్లో క్రమమైన సమావేశాలు నిర్వహించడం ద్వారా సంఘాలు బలోపేతం కావడంతో పాటు మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని మెప్మా రాష్ట్ర ఐబీ ఆదినారాయణ అన్నారు.శుక్రవారం నంద్యాలలో జిల్లా పథక సంచాలకుల అధ్యక్షతన నిర్వహించిన మెప్మా జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని కార్యక్రమాల అమలుపై సమీక్ష నిర్వహించి అధికారులకు పలు సూచనలు చేశారు.అనంతరం ముఖ్యమంత్రి ఆలోచన మేరకు "ఒక కుటుంబం?ఒక పరిశ్రమవేత్త" కార్యక్రమంలో భాగంగా జగ్గనని నగర్‌లో ఏర్పాటు చేసిన డిజి లక్ష్మి కామన్ సర్వీస్ సెంటర్ను లబ్ధిదారురాలు శ్రీమతి షేక్ షంషాద్‌తో కలిసి ప్రారంభించారు. ఈ కేంద్రం ద్వారా ప్రభుత్వ పథకాలతో పాటు వివిధ ఆన్‌లైన్ సేవలు ప్రజలకు అందుబాటులోకి రావడంతో మహిళల స్వయం ఉపాధికి దోహదపడుతుందని తెలిపారు.




# సంపాదకీయం

శనివారం 04-07-2026

## పార్లమెంట్ లో వ్యూహాత్మకంగా కార్యాచరణ

2029 లోక్‌సభ ఎన్నికలకు ముందే డీలిమిటేషన్ బిల్లు, మహిళా రిజర్వేషన్ బిల్లుల ఆమోదింప జేసుకోవాలన్న కృతనిశ్చయంతో ఉంది కేంద్రం. రెండింటికి పార్లమెంట్‌లో ఆమోదం పొందేలా?ప్రభుత్వం వ్యూహాత్మకంగా కార్యాచరణను సిద్ధం చేస్తోంది. వర్షాకాల సమావేశాల్లో డీలిమిటేషన్ బిల్లును పునఃప్రవేశపెట్టేందుకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ సన్నాహాలు చేస్తోంది. మహిళా కోటా విషయానికొస్తే.. 2023లో ఆమోదించిన మహిళా రిజర్వేషన్ చట్టం ప్రకారం.. పునర్విభజన తర్వాతే 33 శాతం కోటా అమల్లోకి రావాలి. ఎస్సీ, ఎస్టీ రిజర్వ్‌డ్ స్థానాల్లో కూడా వన్–థర్డ్ కోటాను మహిళలకు కేటాయించనున్నారు. దీంతో అదే దామాషాలో ఆయా వర్గాల మహిళలకూ లబ్ధి చేకూరుతున్నట్టే. 2023లో ఆమోదం పొందిన మహిళా రిజర్వేషన్ల బిల్లుతో లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు లభిస్తాయి. నియోజకవర్గాల పునర్విభజన కాకపోవడంతో ఈ చట్టం అమల్లోకి రాలేదు. నియోజకవర్గాల పునర్విభజనకు ముందుగానే ఈ చట్టాన్ని అమలు చేయాలంటే మరో రాజ్యాంగ సవరణ తప్పనిసరి. చట్టం ఏర్పడిన తర్వాత వచ్చే మొదటి జనాభా లెక్కల సేకరణ అనంతరం చేపట్టే నియోజకవర్గాల పునర్విభజన తర్వాతే మహిళలకు రిజర్వేషన్‌ను అమలుచేయాలని చట్టం నిర్దేశిస్తోంది. నియోజకవర్గాల పునర్విభజనకు అతీతంగా ఇది అమలు చేయాలంటే ఈ చట్టంలోని సెక్షన్ 5ని ప్రభుత్వం సవరించాల్సి ఉంటుంది. ఇది పార్లమెంట్ ఉభయ సభల్లో హాజరైన సభ్యుల్లో మూడింట రెండు వంతుల మంది ఆమోదంతోనే చట్ట సవరణ చేయాల్సి ఉంటుందని? రాజ్యాంగంలోని 368(2) అధికరణ నిర్దేశిస్తోంది.నియోజకవర్గాల పునర్విభజన జరగాలంటే పలు రాజ్యాంగ సవరణలు చేయాల్సి ఉంటుంది. అలా రాజ్యాంగ సవరణ కోసం ప్రవేశపెట్టే బిల్లులకు ఉభయ సభల్లో ప్రత్యేక మెజారిటీ అవసరం. సభలో సభ్యుల హాజరు సగానికిపైగా ఉండాలి. హాజరైన వారిలో మూడింట రెండు వంతుల మంది ఆ బిల్లుకు మద్దతు తెలుపాలి. అప్పుడే ఆ బిల్లు ఆమోదం పొందుతుంది. లోక్‌సభలో ప్రస్తుతం ఉన్న 540 మంది ఎంపీలు సభకు హాజరైతే.. వారిలో 360 మంది తప్పనిసరిగా బిల్లుకు మద్దతు తెలపాలి. లోక్‌సభలో ఆమోదం పొందిన బిల్లు రాజ్యసభ ముందుకు వస్తుంది. రాజ్యసభలో ప్రస్తుతం ఉన్న 244 మంది సభ్యులు సభకు హాజరైతే.. 163 మంది బిల్లుకు మద్దతు తెలపాలి. అప్పుడే ఆ బిల్లు రాష్ట్రపతి ఆమోదం అనంతరం చట్టంగా మారుతుంది. కానీ అధికార ఎన్డీయే కూటమికి ఉభయ సభల్లో ఇప్పుడు అంత బలం లేదు. అందుకే ఆ బలం కూడగట్టానికి రకరకాల రాజకీయ వ్యూహాలకు పదును పెడుతున్నారు.ఏప్రిల్‌లో మహిళా రిజర్వేషన్ ప్యాకేజీలో భాగంగా వచ్చిన డీలిమిటేషన్‌కు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో 54 ఓట్ల తేడాతో ఆమోదం పొందలేదు. అయితే తాజా రాజకీయ పరిణామాల తరుణంలో అదే బిల్లు మళ్లీ ప్రవేశపెడితే ఆమోదం పొందే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ప్రస్తుతం లోక్‌సభలో బలాబలాలు చూస్తే.. మొత్తం సభ్యుల సంఖ్య 543గా ఉంది. మూడు సీట్లు ఖాళీగా ఉన్నాయి. అంటే ప్రస్తుత సభ్యుల సంఖ్య 540 మాత్రమే. మూడింట రెండొంతుల మెజార్టీ అంటే 360 మంది మద్దతు కావాలి. ఎన్డీఏకు ప్రస్తుతం 318 మంది సభ్యులున్నారు. ప్రతిపక్షానికి 184 మంది సభ్యుల బలం ఉంది. ఇతరులు 38 మంది ఉన్నారు. బడ్జెట్ సమావేశాల్లో మహిళా రిజర్వేషన్, రాజ్యాంగ సవరణ బిల్లుల ఓటింగ్ సమయంలో 528 మంది సభ్యులు హాజరయ్యారు. అప్పుడు బిల్లు ఆమోదానికి 352 ఓట్లు అవసరమయ్యాయి. ఎన్డీయే కు అనుకూలంగా 298 ఓట్లు మాత్రమే రావడంతో 54 ఓట్ల తేడాతో బిల్లు ఆగిపోయింది. కానీ అప్పటికి, ఇప్పటికి పరిస్థితులు మారిపోయాయి. ప్రస్తుతం టీఎంసీ రెబల్ ఎంపీలు 20 మంది, ఉద్ధవ్ థాక్రే శివసేన ఎంపీలు ఆరుగురు కలిపి ఎన్డీఏ ఖాతాలోకి 26 ఓట్లు అదనంగా వస్తాయని అంచనా. అప్పుడు లోక్‌సభలో ఎన్డీఏ బలం 318 నుంచి 344కు పెరుగుతుంది.స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే కాంగ్రెస్‌తో విభేదాల తరుణంలో ఇండి కూటమికి దూరమైంది. ఇప్పటికే బీజేపీ డీఎంకేను ఎన్డీఏలోకి ఆహ్వానించిందనే ప్రచారం జరుగుతోంది. డీఎంకే ఎన్డీఏలో చేరకపోయినా.. లోక్‌సభలో ఎన్డీఏకు జై కొడితే.. ఆ పార్టీకి చెందిన 22 మంది ఎంపీల బలం కూడా జత కలుస్తుంది. అప్పుడు ఎన్డీఏ బలం ఏకంగా 344 నుంచి 366కు పెరుగుతుంది. ఇప్పటికే ఈ మేరకు స్టాలిన్ నుంచి హామీ ఉందని కూడా బీజేపీ వ్యూహాత్మకంగా ప్రచారం చేసుకుంటోంది. సరే ఇక్కడివరకు లోక్‌సభలో పరిస్థితి ఓకే. కానీ కీలకమైన రాజ్యసభ సంగతేంటి అనే ప్రశ్న వస్తుంది. రాజ్యసభలో రెండొంతుల మెజారిటీకి 164 మంది సభ్యుల మద్దతు అవసరం. ప్రస్తుతం ఎన్డీఏ దగ్గర 150 మంది సభ్యులు ఉన్నారు. ఇక్కడ కూడా డీఎంకేకు చెందిన 8 మంది సభ్యుల మద్దతు లభిస్తే సంఖ్య 158కు చేరుతుంది. అప్పుడు మరో ఆరుగురు సభ్యుల మద్దతు అవసరం అవుతుంది. అయితే వచ్చే సెషన్‌లో మహిళా, డీలిమిటేషన్ బిల్లులు వచ్చే సమయానికి.. ఏదో రకంగా ఈ బలం సమకూర్చుకోవచ్చనేది బీజేపీ ఆలోచనగా ఉంది. పైగా ఒక్కసారి బిల్లులు లోక్‌సభ ఆమోదం పొందితే.. రాజ్యసభలో అనుకోని విధంగా మద్దతు లభిస్తుందనే లెక్కలు కూడా లేకపోలేదు.ఇప్పటికే టీఎంసీ, శివసేన యూబీటీ నుంచి ఎంపీల్ని ఆకర్షించి మద్దతు కూడగట్టడంలో సఫలమైన బీజేపీ..ఇప్పుడు శరద్ పవార్ ఎన్సీపీ, నవీన్ పట్నాయక్ బిజూ జనతాదళ్, పంజాబ్‌లో ఆప్ మీద కూడా కన్నేసినట్టు చెబుతున్నారు.

## ప్రజాసేవా విభాగాన్ని ప్రారంభించిన కర్ణాటక.. పౌర సమస్యలు నేరుగా పరిష్కరించేందుకే: సీఎం డీకే

న్యూ ఢిల్లీ, పాలనకు, పౌర సేవలకు సంబంధించి కర్ణాటక ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రజా సమస్యల్ని త్వరగా పరిష్కరించేందుకు 'ప్రజా సేవ విభాగాన్ని' ప్రారంభించింది. ప్రజల నుంచి సమస్యలపై వినతులు స్వీకరించి, వాటి పరిష్కారానికి ఈ విభాగం కృషి చేస్తుంది. ఈ విభాగానికి ఒక మంత్రి నాయకత్వం వహిస్తారని, ప్రత్యేకంగా



ఏర్పాటు చేసిన సిబ్బంది సహకారం అందిస్తారని కర్ణాటక సీఎం డీకే శివకుమార్ తెలిపారు. ప్రభుత్వ అధికారులు వేగంగా స్పందించి, సమస్యల్ని పరిష్కరిస్తారన్నారు. 'ప్రజా సేవా విభాగం'తోపాటు 'ప్రజా సేవ అభియాన (పీఎస్ఏ)' అనే మరో కార్యక్రమాన్ని కూడా ప్రభుత్వం ప్రారంభిస్తున్నట్లు సీఎం చెప్పారుదీనిద్వారా మంత్రులు ప్రతి నెలా జిల్లాలకు వెళ్లి, స్థానిక ప్రజలతో మాట్లాడతారని, అక్కడి సమస్యలు విని పరిష్కరిస్తారని సీఎం డీకే శివకుమార్ తెలిపారు. క్యాబినెట్ సమావేశం అనంతరం సీఎం ఈ విషయాల్ని వెల్లడించారు. ప్రజల విజ్ఞాపనల్ని పరిష్కరించేందుకే ఈ విభాగాల్ని ప్రారంభిస్తున్నట్లు స్పష్టం చేశారు. ప్రజలు తమ సమస్యలపై నేరుగా ఈ విభాగంలో ఫిర్యాదు చేస్తే, సంబంధింత విభాగానికి వాటిని బదిలీ చేస్తామని, అక్కడి అధికారులు వాటిని పరిష్కరిస్తారని సీఎం వివరించారు. ఈ విభాగానికి ఒక ఐఏఎస్ అధికారి సెక్రెటరీగా ఉంటారని, ఇతర అధికారులను కూడా నియమించి ప్రజల ఫిర్యాదులపై నిరంతరం పర్యవేక్షిస్తామన్నారు. ప్రజల ఫిర్యాదుల్ని అవసరమైతే అధికారులతోపాటు సంబంధిత మంత్రులు, జిల్లా ఇంఛార్జ్ మంత్రులు, జిల్లా ఉన్నతాధికారులు పరిశీలిస్తారని చెప్పారు.ఈ మొత్తం వ్యవహారం కోసం ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేస్తామన్నారు. ఇందుకోసం వివిధ విభాగాలకు చెందిన ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు కూడా ఏర్పాటు చేస్తారు. ఇక.. ప్రజా సేవ అభియానాలో భాగంగా జిల్లా ఇంఛార్జ్ మంత్రులు ప్రతినెలా మొదటి, మూడవ శనివారం తమ పరిధిలోని వివిధ నియోజకవర్గాలలో పర్యటిస్తారు. ఒకవేళ ఆ రోజు ప్రభుత్వ సెలవు దినం అయితే.. ముందు రోజే మంత్రులు పర్యటిస్తారు. స్థానికంగా ప్రజల నుంచి వినతులు స్వీకరించి పరిష్కరిస్తారు. ప్రభుత్వాన్ని ప్రజల వద్దకు చేర్చేందుకే ఈ కార్యక్రమాలు చేపడుతున్నామని డీకే శివకుమార్ వివరించారు.

## టోల్ బూత్‌ను ఢీకొట్టి పేలిన ఎల్పీజీ ట్యాంకర్..

### భారీగా మంటలు, ఐదుగురు మృతి

లక్నో: ఒక ఎల్పీజీ ట్యాంకర్ టోల్ బూత్‌ను ఢీకొట్టింది. దీంతో ట్యాంకర్‌లోని గ్యాస్ లీకైంది. ఆ వెంటనే భారీ పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో ఐదుగురు వ్యక్తులు మరణించారు. పలువురు గాయపడ్డారు. ఆ ప్రాంతంలోని సీసీటీవీలో రికార్డైన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఉత్తరప్రదేశ్‌లోని కౌశాంబి జిల్లాలో ఈ సంఘటన జరిగింది. జూన్ 26న ఉదయం 6:40 గంటల సమయంలో సిరోహి టోల్ ప్లాజా వైపు రెండు ఎల్పీజీ ట్యాంకర్లు వచ్చాయి. వాటిలో ఒకటి అదుపుతప్పింది. డివైడర్‌ను ఢీకొట్టి టోల్ బూత్‌లోకి దూసుకెళ్లింది.కాగా, కాన్పూర్ నుంచి ప్రతాప్‌గఢ్‌కు వెళ్తున్న ఈ ఎల్పీజీ ట్యాంకర్ నుంచి భారీగా గ్యాస్ లీక్ అయ్యింది. అనంతరం కొన్ని నిమిషాల్లోనే భారీ పేలుడు సంభవించింది. సుమారు రెండు కిలోమీటర్ల దూరం వరకు ఈ మంటలు కనిపించాయి. ఇది చూసి స్థానికులు భయాందోళన చెందారు. ఈ సమాచారం తెలిసిన వెంటనే జిల్లాలోని అన్ని అగ్నిమాపక వాహనాలు, సిబ్బంది, పోలీసులు అక్కడకు చేరుకున్నారు. పలు గంటలు శ్రమించి మంటలను అదుపుచేశారు.మరోవైపు ఈ ప్రమాదంలో ట్యాంకర్ డ్రైవర్ 40 ఏళ్ల ధర్మేంద్ర



దూబే, టోల్ ప్లాజా ఉద్యోగి అలోక్ సింగ్ అక్కడికక్కడే మరణించారు. టోల్ ప్లాజాకు చెందిన మరి కొందరు సిబ్బంది తీవ్రంగా గాయపడ్డారు. వారిని ఆసుపత్రికి తరలించారు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌కు చెందిన అనిల్ కుమార్ చికిత్స పొందుతూ జూలై 1న మరణించాడు. సహోద్యోగులైన ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీకి చెందిన హీరామణి సింగ్, మధ్యప్రదేశ్‌కు చెందిన కృష్ణ పాల్ మౌర్య మరునాడు చనిపోయారు.అయితే ఆ టోల్ ప్లాజా సమీపంలో పార్క్ చేసిన 16 బైకులు, రెండు కార్లు కూడా మంటల్లో పూర్తిగా కాలిపోయాయి. ఈ ప్రమాదం తర్వాత ట్రాఫిక్ రద్దీని నివారించేందుకు కొంతసేపు వాహనాలను టోల్ ప్లాజా గుండా ఉచితంగా వెళ్లేందుకు అనుమతించారు. ఈ ప్రమాదంపై దర్యాప్తు కోసం ఒక సాంకేతిక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఆ ప్రాంతంలోని సీసీటీవీలో రికార్డైన గ్యాస్ ట్యాంకర్ పేలుడు వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

## 'మతపరమైన ఆచారాల ముసుగులో క్రిమినల్ నేరాలను సమర్థించలేం'

హలాలా, ట్రిపుల్ తలాక్ కేసులో అలహాబాద్ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. వ్యక్తిగత చట్టాలు, మతపరమైన ఆచారాల ముసుగులో క్రిమినల్ నేరాలను సమర్థించలేమని న్యాయస్థానం స్పష్టం చేసింది. తీవ్ర శిక్షార్హమైన నేరారోపణలు ఉన్న కేసులను కేవలం పర్సనల్ లా పేరిట ఎఫ్ఐఆర్‌ను రద్దుచేయాలని కోరడం సమంజసం కాదని జస్టిస్ జె.జె.మునీర్, జస్టిస్ తరుణ్ సక్సేనాలతో కూడిన ధర్మాసనం పేర్కొంది.ఈ మేరకు హలాలా పేరుతో ఓ మహిళపై లైంగిక దోపిడీ, సామూహిక అత్యాచారం సంబంధిత ఆరోపణల కేసులో 9 మంది నిందితులపై నమోదైన కేసును కొట్టివేయాలనే పిటిషన్ను కోర్టు తిరస్కరించింది. ఈ వ్యాజ్యం విచారణ సందర్భంగా.. ఈ ఆరోపణలు సమాజంలోని ఓ వర్గం ఇప్పటికీ రాజ్యాంగం కల్పించిన సమానత్వం, వ్యక్తిగత గౌరవం, గోప్యత వంటి మౌలిక విలువలకు దూరంగా ఉన్నట్టు సూచిస్తున్నాయని పేర్కొంది.ఉత్తర్‌ప్రదేశ్ అమ్రోహాకు చెందిన ఓ బాధితురాలు.. తనకు 15 ఏళ్ల వయసు(2015)లో బలవంతంగా వివాహం జరిగినట్టు ఆరోపించారు. ఆ తర్వాత 2016లో భర్త ట్రిపుల్ తలాక్ ఇచ్చాడని, కానీ మరలా అతడినే పెళ్లాడాలంటే హలాలా తప్పనిసరని మతపెద్దలు బలవంతం చేశారని ఆమె తన ఫిర్యాదులో పేర్కొన్నారు. హలాలా పేరిట ఓ వ్యక్తి తనను శారీరకంగా వేధించాడని, అనంతరం 2017లో మరలా మొదటి భర్తతోనే వివాహం జరిగినట్లు ఆరోపించారు. ఆ తర్వాత 2021లో మరోసారి అతడు ట్రిపుల్ తలాక్ చెప్పి, వేరే మహిళను పెళ్లాడాడన్నారు. ఆ పిదప మళ్లీ కలిసి జీవిద్దామని చెప్పిన భర్త కుటుంబ సభ్యులు.. రెండు మార్లు తలాక్ జరిగినందున మరోసారి హలాలా చేయాల్సిందేనని బెదిరించారని ఆమె వాపోయారు. ఈ క్రమంలో 2025 ఫిబ్రవరిలో భర్త సోదరులు హలాలా పేరిట తనపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారన్న ఆమె.. ఆ తర్వాత నామమాత్రంగా ఓ నికాహ్ కూడా చేశారని చెప్పుకొచ్చారు.కాగా.. ఈ వ్యవహారం ముస్లిం వ్యక్తిగత చట్టాలు, మతపరమైన ఆచారాలకు సంబంధించినదని.. ఫలితంగా ఎఫ్ఐఆర్‌ను రద్దుచేయాలని న్యాయస్థానాన్ని కోరారు నిందితులు. అయితే.. ఈ వాదనల్ని ధర్మాసనం పూర్తిగా తిరస్కరించింది. క్రిమినల్ చట్టం అమలులో ఉండగా వ్యక్తిగత చట్టాలకు ప్రాధాన్యం ఇవ్వలేమని, చట్టంలో ప్రత్యేక మినహాయింపులేమైనా ఉన్నప్పుడే ఇలాంటి వాదనలకు అవకాశముంటుందని స్పష్టం చేసింది. బాలికలపై లైంగిక సంబంధాలకు వ్యక్తిగత చట్టాలను రక్షణగా చూపలేమని, అలాంటి కేసులకు పోక్సో చట్టం వర్తిస్తుందని పేర్కొంది. దీంతోపాటు గతంలో ఇచ్చిన తాత్కాలిక ఉత్తర్వులన్నింటినీ కోర్టు రద్దు చేయడంతో.. ఈ కేసును పోలీసులు పూర్తిస్థాయి దర్యాప్తు చేపట్టేందుకు మార్గం సుగమమైంది.




## సవాల్ విసరడం, పారిపోవడం రేవంత్ రెడ్డికి వెన్నతో పెట్టిన విద్యా: మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి



హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిపక్ష పార్టీలకు సవాల్ విసరడం, పారిపోవడం వెన్నతో పెట్టిన విద్యా అని మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి విమర్శించారు.తెలంగాణ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులకు సవాల్ విసిరి తోక ముడిచిన కాంగ్రెస్ మంత్రుల డొల్లతనం బయటపడిందని , మంత్రులు పోలీసులను అడ్డంపెట్టుకొని పారిపోయారని ఆరోపించారుగతంలో సవాల్ చేసిన రేవంత్ రెడ్డి ప్రెస్‌క్లబ్‌ను కల్లు కాంపౌండ్‌తో పోల్చి పారిపోగా , కొడంగల్‌లో ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానని చెప్పి మూడు నెలల్లోనే మల్కాజీగిరి ఎంపీగా పోటీ చేశారని ఎద్దేవా చేశారు.ఉద్యమం జరిగినప్పుడు గుర్తుకు రాని గన్‌పార్క్ కాంగ్రెస్ మంత్రులకు ఇప్పుడు గుర్తొచ్చిందా ? అంటు ప్రశ్నించారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌పై మంత్రులు అహంకారంతో మాట్లాడుతున్నారని ఆరోపించారు.ప్రభుత్వం వద్ద సమాధానం లేనప్పుడే ప్రతిపక్ష నాయకులను అరెస్టులు చేస్తారని మండిపడ్డారు. ఏదేని సమస్యపై రేవంత్ రెడ్డి డిఫెన్స్ లో పడగానే బండి సంజయ్ తెరపైకి వస్తాడని, బండి సంజయ్ డిఫెన్స్ లో పడగానే ముఖ్యమంత్రి తెరపైకి వస్తాడని విమర్శించారు. అమృత్ టెండర్ లో ముఖ్యమంత్రి బావమరిది సృజన్ రెడ్డి కుంభకోణంపై కేంద్రానికి లేఖ రాస్తే చర్యలు ఎందుకు తీసుకోలేదని వేముల ప్రశ్నించారు.బొగ్గు కుంభకోణం జరిగిందని కేంద్రానికి లేఖ రాస్తే ఇంతవరకు చర్యలే లేవని అన్నారు. కేటీఆర్ హరీష్ రావు సెగకు మంత్రులు ఒక్కొక్కరు బయటకు వస్తున్నారని, .ఇక ముందు ఇలాంటివి చాలా జరుగుతాయని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నాయకుల ఆరోపణలతో సింగరేణిలో బొగ్గు మాయం పై మంత్రి భట్టి విజిలెన్స్ విచారణకు ఆదేశించారని వెల్లడించారు.

## ప్రాంక్ వీడియోల కోసం ఈ-రిక్షాల 'రిమోట్ షట్‌డౌన్' కలకలం.. 2 యాప్స్ డిలీట్!




ఢిల్లీ, జూలై 3: సోషల్ మీడియాలో 'ప్రాంక్ వీడియోల' కోసం కొందరు ఆకతాయిలు చేస్తున్న విపరీత చేష్టలకు ఫుల్ స్టాప్ పడింది. కొన్ని రోజులుగా ఢిల్లీ, తదితర ప్రాంతాల్లో ఈ–రిక్షా డ్రైవర్లను వేధింపులకు గురిచేస్తూ, ప్రయాణికుల భద్రతను ప్రమాదంలో పడేయడానికి కారణమవుతున్న 2 వివాదాస్పద చైనీస్ బ్యాటరీ మేనేజ్‌మెంట్ యాప్స్‌పై కేంద్రం నిఘా పెట్టి, వాటిని డిలీట్ చేయించింది. 'ఃఐ–ఃఓూ', 'ఇజూనీఇష్ట్ర ఒతి–తినీని' అనే ఈ రెండు యాప్‌లను గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్ల నుంచి పూర్తిగా తొలగించినట్లు కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ (ఓవతిబిజ) సెక్రటరీ ఎస్. కృష్ణన్ ఇవాళ వెల్లడించారు. బలహీనపరుస్తాయిచైనాకు చెందిన 'షెన్‌జెన్ గ్రీనర్జీ టెక్నాలజీ' అభివృద్ధి చేసిన 'ఃఐ–ఃఓూ' యాప్ నిజానికి లిథియం–అయాన్ బ్యాటరీల వోల్టేజ్, ఉష్ణోగ్రత, ఛార్జింగ్ సైకిల్స్, బ్యాటరీ ఆరోగ్యాన్ని పర్యవేక్షించడానికి రూపొందించిన ఒక సాధారణ యాప్. ఈ యాప్‌లో బ్యాటరీ పవర్‌ను ఆన్ లేదా ఆఫ్ చేసుకునే 'డిశ్చార్జ్ కంట్రోల్' ఫీచర్ కూడా ఉంది.భద్రతా లోపం: భారతదేశంలో నడిచే చాలా బడ్జెట్ ఈ–రిక్షాలు, ఎలక్ట్రిక్ టూ–వీలర్లలో చైనా తయారీ బ్యాటరీ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్ (ఃఓూ) వాడుతున్నారు. అయితే, ఈ సిస్టమ్స్‌కు ఎలాంటి పాస్‌వర్డ్ ప్రొటెక్షన్ ఉండదు. కంపెనీ ఇచ్చిన సాధారణ పాస్‌వర్డ్‌లతోనే ఇవి పనిచేస్తాయి.దీనిని ఆసరాగా చేసుకుని కొందరు ఆకతాయిలు సోషల్ మీడియాలో వ్యూస్ కోసం ఒక ట్రెండ్ మొదలుపెట్టారు. రోడ్డుపై ఈ–రిక్షా వెళ్తున్నప్పుడు.. దానికి 10 నుంచి 15 మీటర్ల బ్లూటూత్ పరిధిలో నిలబడి, ఈ యాప్‌ల ద్వారా సదరు రిక్షా బ్యాటరీకి కనెక్ట్ అవుతున్నారు. రిక్షా కదులుతుండగానే అకస్మాత్తుగా పవర్ కట్ చేసి వాహనాన్ని నిలిపివేస్తున్నారు.దీనివల్ల కదులుతున్న వాహనాలు అకస్మాత్తుగా ఆగిపోయి వెనుక వచ్చే వాహనాలు ఢీకొనే ప్రమాదం ఏర్పడటమే కాకుండా, రోజువారీ కూలీలైన ఈ–రిక్షా డ్రైవర్లు నడిరోడ్డుపై గంటల తరబడి చిక్కుకుపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

## దారుణం.. పోలీసును విచక్షణారహితంగా కొట్టిన యువకులు..

మహారాష్ట్ర: నాగ్‌పూర్‌లో షాకింగ్ ఘటన వెలుగు చూసింది. ద్విచక్ర వాహనాలపై వెంబడించిన కొందరు యువకులు నడిరోడ్డుపై ఓ పోలీసును విచక్షణారహితంగా కొట్టారు. ఇష్టమొచ్చినట్లు పిడిగుద్దులు కురిపించారు. దాడిలో తీవ్రంగా గాయపడిన పోలీసును స్థానికులు ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి. పోలీసుపై దాడి జరగడం నెట్టింట పెద్దఎత్తున చర్చకు దారి తీసింది.ఓ పోలీస్ అధికారి (35) తన వ్యక్తిగత కారులో మహిళా స్నేహితురాలితో కలిసి మన్‌కాపూర్ చౌక్ వైపు వెళ్తున్నారు. ఆ సమయంలో వారి కారు, నిందితుల ద్విచక్రవాహనం స్వల్పంగా ఢీకొనడంతో వివాదం చెలరేగింది. అధికారి కారును అడ్డగించిన యువకులు అనంతరం ఆయనతో వాగ్వాదానికి దిగారు. కారును ధ్వంసం చేయడంతో పాటు పోలీసును కారులోంచి బయటకు లాగారు. విచక్షణారహితంగా కొట్టుకుంటూ రోడ్డు అవతలి వైపునకు ఈడ్చుకెళ్లారు. ఆపై తీవ్రంగా గాయపడేలా దాడి చేశారు. రోడ్డుపై పదులకొద్దీ వాహనాలు వెళ్లినా.. యువకులను నిలువరించేందుకు ఎవరూ సాహసం చేయలేకపోయారు. దాడి అనంతరం యువకులు అక్కడి నుంచి పారిపోయారు. స్థానికులు కొంతమంది కలుగజేసుకుని బాధితుడిని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.ఈ దాడికి సంబంధించిన దృశ్యాలు అక్కడి సీసీ కెమెరాల్లో నిక్షిప్తమయ్యాయి. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. దుండగులను హర్ష్ పవార్, గౌరవ్ ధిర్డే, సంయమ్ గణేశ్‌పురి, యాస్ ప్రతేకి, సత్యం షిర్కే, ప్రేమ్‌రాజ్ ధాకటే, ఆకాశ్ బోకాడే, నితిన్ గోఖలే, విక్కీ తెల్హారే, భూమి దేవ్ అలియాస్ సాగర్ బోడ్డే, గణేశ్ ఉయికే, ప్రీతమ్ మోడేకర్, టికారామ్ బరాపాత్రేగా గుర్తించి అరెస్టు చేశారు.

## హోమ్ మంత్రిగారి మౌనమెందుకో...



విజయవాడ, జూలై 3, ఏపీ హోం మినిస్టర్ వంగలపూడి అనిత యమా యాక్టివ్‌గా ఉంటారు. పొలిటికల్ ప్రత్యర్థులపై ఓ రేంజ్‌లో విరుచుకుపడుతుంటారు. ప్రతిపక్ష నేత జగన్‌ను ఉద్దేశించి పులివెందుల ఎమ్మెల్యే అని సెటైరికల్‌గా మాట్లాడ్డం ఆమెతోనే మొదలైందని చెప్పుకుంటాయి రాజకీయవర్గాలు. అంతవరకు సరే.. రాజకీయ వ్యవహారాల్లో ఎవరి లెక్కలు వారికి ఉంటాయి. కానీ, మంత్రి హోదాలో ఉండి సంబంధింత శాఖ వ్యవహారాల గురించి పట్టించుకోకుండా అనిత కేవలం పొలిటికల్ స్టేట్‌మెంట్స్‌కే పరిమితం అవుతున్నారా అన్నది చాలా మందికి వస్తున్న లేటెస్ట్ డౌట్.ఎందుకంటే.. రాష్ట్రాన్ని కుదిపేసిన సాయికృష్ణ కస్టోడియల్ డెత్ కేసుపై హోం మినిస్టర్ సక్రమంగా స్పందించలేదన్నది రాజకీయవర్గాల విస్తృతాభిప్రాయం. ఆ వ్యవహారానికి సంబంధించి ఇప్పటివరకు ఒకే ఒక్కసారి స్పందించారామె. అదీ కూడా కేవలం ఐదు సెకన్ల రియాక్షన్. సాధారణంగా పొలిటికల్ స్టేట్‌మెంట్స్ విషయంలో అనర్గళంగా మాట్లాడే అనిత అత్యంత కీలకమైన కేసు విషయంలో కేవలం ఐదు సెకన్లకే ఎందుకు పరిమితం అయ్యారన్నది బిగ్ క్వశ్చన్. రాష్ట్ర హోం మంత్రిగా అంత సీరియస్ సమస్య మీద సరిగా స్పందించకపోవడంపై వివిధ వర్గాల్లో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయట.కస్టోడియల్ డెత్ కేసు విషయంలో ఎందుకొచ్చిన గొడవ అనుకుంటూ మంత్రే మాట్లాడ్డం లేదా? లేక స్పందించవద్దని ఆమెకు ఆదేశాలున్నాయా అన్న చర్చలు సైతం పెరుగుతున్నాయి. ఇదే విషయాన్ని విపక్షాలు సైతం నిలదీస్తున్నాయి. అత్యంత ముఖ్యమైన కేసు విషంలో హోం మంత్రి స్పందన అత్యంత పేలవంగా ఉండటం ఏంటి? హోం మంత్రి నోరు కట్టేస్తోంది ఎవరో తేల్చాలంటూ డిమాండ్ చేస్తున్నారు ప్రతిపక్ష నాయకులు. ఈ కేసుకు సంబంధించి హోం మంత్రి రియాక్షన్‌పై రాజకీయవర్గాలతో పాటు సామాన్యుల్లో సైతం రకరకాల డౌట్స్ పెరుగుతున్నాయట.రాష్ట్రానికి చెందిన మాజీ మంత్రి ఒకరు హోం మినిస్టర్ మేకప్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తే.. అంతా ఖండించారు. అలాంటిది ఒక ప్రాణం విషయంలో ఆ స్థాయి స్పందన లేకపోవడం ఏంటన్న మాటలు వినిపిస్తున్నాయి. పై నుంచి వచ్చిన ఆదేశాలతోనే అనిత అలా వ్యవహరిస్తున్నారా అన్న సందేహాలు చాలామందిలో వ్యక్తం అవుతున్నాయి. ఈ విషయంలో సంబంధిత మంత్రికంటే ఎక్కువగా ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ స్పందించారు. అయినాసరే ఆమె నుంచి నో రియాక్షన్ అంటే? దీన్నెలా అర్థం చేసుకోవాలంటూ క్వశ్చన్ మార్క్ ఫేస్ పెడుతున్నారు పరిశీలకులు. ఇదే సమయంలో చాలామంది ఇప్పుడు డిప్యూటీ సీఎం వ్యాఖ్యలను కోట్ చేస్తున్నారట. నేనే హోమ్ మంత్రి అయిఉంటే పరిస్థితి వేరే విధంగా ఉండేదని పవన్ వ్యాఖ్యానించడం..అనిత విషయంలో సరిగ్గా సరిపోతుందా అనే చర్చలు సైతం నడుస్తున్నాయి. పవన్‌కళ్యాణ్ ఏ ఉద్దేశ్యంతో అలాంటి వ్యాఖ్యలు చేశారోగానీ.. వాతావరణం మాత్రం అలాగే కనిపిస్తోందని అభిప్రాయపడుతున్నారు కొందరు.కారణం ఏదైనాసరే.. రాష్ట్రంలో ఇంత పెద్ద ఘటన జరిగితే హోమ్ మంత్రి నోరు మెదపక పోవడం మాత్రం తీవ్ర చర్చనీయాంశం అయింది

## టూ టైర్ సిటీస్ లో విల్లా కల్చర్

కాకినాడ, జూలై 3, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా స్థిరాస్తి మార్కెట్ ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా స్థిరమైన వృద్ధి రేటుతో దూసుకుపోతోంది. ముఖ్యంగా రాజమండ్రి రూరల్ పరిసర ప్రాంతాలతో పాటు కాకినాడ అచ్యుతాపురం ఎకనామిక్ జోన్ వైపు వెళ్లే ప్రధాన రహదారుల వెంబడి రియల్ ఎస్టేట్ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. పారిశ్రామిక విస్తరణ, మౌలిక వసతుల కల్పన వేగవంతం కావడంతో ఈ కారిడార్‌లోని ల్యాండ్ మార్కెట్ వైపు మదుపరులు భారీగా ఆకర్షితులవుతున్నట్లు ఈ వారం పత్రికల బిజినెస్ పేజీలు ప్రత్యేక విశ్లేషణాత్మక కథనాలను ప్రచురించాయి.ఈ ప్రాంతంలో రియల్ ఎస్టేట్ ఇంతలా పుంజుకోవడానికి ప్రధాన బలం గోదావరి జిల్లాల్లోని సంపన్న వర్గాల నుంచి వస్తున్న పెట్టుబడులేనని మార్కెట్ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. జిల్లాలో అత్యంత లాభదాయకంగా సాగుతున్న ఆక్వా రంగానికి చెందిన ప్రముఖులు, స్థానిక పారిశ్రామికవేత్తలు తమకు వస్తున్న లాభాలను సురక్షితమైన ఇన్వెస్ట్‌మెంట్ మార్గంగా భావించి భూములపై పెడుతున్నారు. షేర్ మార్కెట్, ఇతర వ్యాపారాల కంటే స్థిరాస్తి రంగానికే దీర్ఘకాలంలో తిరుగులేని లాభాలు వస్తుండటంతో, వీరంతా గ్రూపులుగా ఏర్పడి మరీ కనెక్టింగ్ రోడ్ల వెంబడి వందల ఎకరాలను కొనుగోలు చేస్తున్నారు.రాజమండ్రి రూరల్ పరిధిలోని శాటిలైట్ సిటీ పరిసరాలు, కడియం, జేగురుపాడు వైపు వెళ్లే మార్గాలతో పాటు.. కాకినాడ నుంచి అచ్యుతాపురం సెజ్ కనెక్టివిటీ ఉన్న రహదారుల ఇరువైపులా కొత్త కొత్త వెంచర్లు వెలుస్తున్నాయి. డీటీసీపీ అనుమతులతో మౌలిక వసతులు కల్పిస్తూ రియల్టర్లు వేస్తున్న లేఅవుట్లకు హాట్ కేకుల్లా డిమాండ్ ఏర్పడింది. మధ్యతరగతి వర్గాలు సొంత ఇంటి కల కోసం ఓపెన్ ప్లాట్లను ఎంచుకుంటుంటే, హైవే ఫేసింగ్ ఉన్న బిట్లను కమర్షియల్ అవసరాల కోసం కొనుగోలు చేసేందుకు పెద్ద ఎత్తున పోటీ నడుస్తోంది.స్థానిక పారిశ్రామిక వేత్తల అండదండలు, నిరంతర నగదు సరఫరా పుష్కలంగా ఉండటంతో ఇక్కడి స్థిరాస్తి వ్యాపారానికి ఎటువంటి ఢోకా లేదన్న అభిప్రాయం వినిపిస్తోంది. అటు ఐటీ, ఇటు పారిశ్రామికంగా కాకినాడ-రాజమండ్రి జంట నగరాల మధ్య రీజినల్ గ్రోత్ కారిడార్ వేగంగా విస్తరిస్తుండటంతో రాబోయే రోజుల్లో ఇక్కడ చదరపు గజం ధరలు మరింతగా పెరగడం ఖాయమని, ఫలితంగా సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల ఆదాయం కూడా భారీగా పెరుగుతోందన్న అంచనాలున్నాయి.

## పద్మారావునగర్ దోపిడి కేసు లో నలుగురు అరెస్టు

సికింద్రాబాద్.ఐదు రోజుల క్రితం పద్మారావు నగర్ లో జరిగిన చోరీ కేసును చిలకలగూడ పోలీసులు ఛేదించారు. నలుగురు ముఠా సభ్యులను అరెస్ట్ చేసారు. దోపిడీకి ఉపయోగించిన షట్టర్ కటింగ్ పరికరాలు, ఆయుధాలు, వాహనాలు స్వాదీనం చేసుకున్నట్లు ఏసీపీ శశాంక్ రెడ్డి వెల్లడించారు. జ్యోతి మెడికల్ హాల్ పెంట్ హౌస్ లో పెద్ద మొత్తంలో నల్లధనం ఉన్నదని దోచుకోవడం కోసం 15రోజుల క్రితమే ప్రణాళిక ముఠా వేసింది. ఆదివారం తెల్లవారు జామున ప్రణాళిక ప్రకారం దోపిడీ చేసింది.

# ఇంకా రాజధాని లొల్లే....

విజయవాడ, జూలై 3, రాజకీయాల్లో ఎపుడూ దూకుడు అవసరమే. అదే సమయంలో ప్రజలను దృష్టిలో పెట్టుకుని ప్రతీ అడుగూ పడాలి. ఇక చెప్పాలీ అంటే విపక్షంలో ఉన్న వారికి బోలెడు అడ్వాంటేజెస్ ఉంటాయి. వారు ఏమైనా చెప్పవచ్చు. తాము అధికారంలోకి వస్తే కొండ మీద కోతిని అయినా తీసుకుని వస్తామని అనవచ్చు. అయితే ఇలాంటి వాటికి హద్దులు లేకపోయినా కొన్ని కీలక పాలసీల విషయంలో మాత్రం పరిమితంగానే చేయాల్సి ఉంటుంది. అలాగే కొన్ని సెంటిమెంట్ల విషయంలో ఆచీ తూచీ ముందుకు సాగాల్సి ఉంటుంది. అంటే సంక్షేమ పథకాల విషయంలో కానీ కొన్ని నూతన నిర్ణయాల విషయంలో కానీ జనాలను తమ వైపునకు తిప్పుకునేందుకు విపక్షానికి అధికార పక్షానికి లేని వెసులుబాటు ఉంటుంది కానీ అదే సమయంలో విధానపరమైన నిర్ణయాల విషయంలో మాత్రం అంతగా అవకాశం ఉండదు అని అంటున్నారు. ఎప్పటి రాజధాని చర్చ, రాజకీయ రచ్చగా అదెప్పటికి తీరెను అన్నది జనంలో ఉన్న వేదన. అయితే వైసీపీ మాత్రం అమరావతి విషయంలో ప్రతీ ఎన్నికలోనూ తన విధానాలను మార్చేసుకుని ముందుకు పోతోంది. 2014 ఎన్నికల్లో జగన్ బ్రహ్మాండమైన రాజధాని అని హామీతో జనం ముందుకు వచ్చారు. బహుశా వైసీపీకి ఆనాడు ఆలోచనలు ఒంగోలు జిల్లా సమీప ప్రాంతంలో కోస్తాకు గ్రేటర్ రాయలసీమ జిల్లాలకు మధ్య రాజధాని నిర్మాణం చేద్దామని అయి ఉండొచ్చు. దొనకొండ వద్ద రాజధాని అని కూడా అప్పట్లో వైసీపీ చాయిస్ గా వినిపించింది. కానీ తొలి చాన్స్ మాత్రం టీడీపీకి దక్కింది. దాంతో అమరావతి పేరుతో టీడీపీ ప్రభుత్వం తన ప్రతిపాదనలను ఆచరణలో పెట్టేందుకు వీలు కలిగింది. ఇక దాని మీద విపక్ష నేతగా అసెంబ్లీలో జగన్ అమరావతికి మద్దతు ప్రకటించారు. అయితే పూర్తిగా ప్రభుత్వ భూములలోనే అన్న కండిషన్ తమ మద్దతులో అని తరువాత చెప్పారు వైసీపీ నేతలుఇక 2019 కి వచ్చేసరికి అమరావతి రాజధానిగా గుర్తిస్తున్నట్లుగా వైసీపీ నేతలు ప్రకటించారు. జగన్ ఏకంగా అక్కడ ఇల్లు కట్టుకున్నారని వారంతా గట్టిగానే చెప్పారు. దాంతో టీడీపీ హయంలో మందగమనంలో సాగుతున్న రాజధాని జగన్ హయాంలో పుంజుకుంటుంది అని భావించే ఆయనకు మద్దతుగా రాజధాని ప్రాంతంతో సహా అంతా ఓటెత్తారు అని విశ్లేషణ ఉంది. అందుకే 151 సీట్లు దక్కాయని కూడా చెబుతారు. ఇక 2019 నుంచి 2024 మధ్యలో అయిదేళ్ల కాలమంతా మూడు రాజధానుల నినాదంతో గడిపారు. ఇక 2024 ఎన్నికల వేళ వైసీపీ మూడు రాజధానులకు జనాలు వ్యతిరేకమని స్పష్టం అయింది అన్నట్లుగా తీర్పు వెలువరించింది. దాంతో మూడు రాజధానులు అనడం వైసీపీ తగ్గించింది. కానీ దానికి ఆల్టర్నేషన్ ని చూసుకోవడానికి వైసీపీకి రెండేళ్ళ కాలం పట్టింది. 2026 ఏప్రిల్ 1న జగన్ ప్రెస్ మీట్ పెట్టి మావిగన్ పేరుతో ఒక సంచలన ప్రకటన చేశారు. దాంతో ఇది పెద్ద చర్చగా మారింది. ఇక 2029 ఎన్నికలకు జగన్ మావిగన్ రాజధానిగా తాము జనంలోకి వెళ్తామని అంటున్నారు. పైగా ఎన్నికల మేనిఫెస్టోలో దానిని పెడతామని ఆయన అంటున్నారు. అమరావతికి వ్యతిరేకం కాదంటూనే కొత్త ఆల్టర్నేషన్ ని తీసుకుని వచ్చారు. దాంతో వైసీపీ రాజధాని స్టాండ్ ఏంటి అన్న ప్రశ్నకు క్లియర్ గా జవాబు వచ్చినట్లు అయింది. అది కూడా ఎన్నికలకు మూడేళ్ళు సమయం ఉండగానే. ఒక విధంగా వైసీపీ ఈ విషయంలో రిస్క్ చేస్తోందా అన్న చర్చ కూడా సాగుతోంది. ఎందుకంటే ముందే చెప్పుకున్నట్లుగా రాజధాని అన్నది ఒక సెంటిమెంట్. ఇక 2024 లో కూటమి అధికారంలోకి వచ్చాక అమరావతి కేంద్రంగా నిర్మాణం పనులు జోరుగా సాగుతున్నాయి. అక్కడ అవినీతి అక్రమాలు జరిగాయి అంటే వాటి మీద వైసీపీ పోరాడవచ్చు, అంతే కాదు ఏపీలో కొత్తగా తాము ఇతర నగరాలను అభివృద్ధి చేస్తామని కూడా వైసీపీ చెప్పుకోవచ్చు. కానీ రాజధాని అంటూ మావిగన్ ని తీసుకుని రావడం మాత్రం సాహసంతో కూడిన అంశంగానే చూస్తున్నారు. ఇది టీడీపీతో వైసీపీ రాజకీయ సమరం అనే దాని కంటే ప్రజల రాజధాని సెంటిమెంట్ మీదనే వైసీపీ కొత్త చాన్స్ తీసుకుంటున్నట్లుగా విశ్లేషిస్తున్నారు. బహుశా వైసీపీకి ఇంతకంటే ఆల్టర్నేషన్ లేదని అనుకోవాలా అన్నది కూడా ఉంది. మరి దీని మీద టీడీపీ మాత్రమే కాదు న్యూట్రల్ జనాలు ఏ విధంగా రియాక్ట్ అవుతారు అన్న దాని మీదనే వైసీపీ మావిగన్ ఇష్యూ ఆధారపడి ఉంటుంది.

## వై నాట్ 174...టీడీపీ నినాదమా...

శ్రీకాకుళం, జూలై 3, తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు రాజ్యసభకు కొత్తగా ఎన్నికైన చింతకాయల విజయ్ తాజాగా ఘాటైన వ్యాఖ్యలు చేశారు. నర్సీపట్నంలో తనకు జరిగిన సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నారా లోకేష్ ని దమ్మున్న నాయకుడిగా కొనియాడారు. లోకేష్ తనది కాని నియోజకవర్గంలో టీడీపీకి అంతగా విజయావకాశాలు లేని సీట్లో గెలిచి చూపించారు అని విజయ్ గుర్తు చేశారు. మంగళగిరిలో ఒకసారి ఓటమి పాలు అయినా పట్టు వీడకుండా లోకేష్ మళ్లీ అదే స్థానం నుంచి గెలిచారు అంటే అదే లోకేష్ సత్తా అని అన్నారు. కానీ విపక్ష నేత జగన్ మాత్రం పులివెందుల దాటి బయటకు వచ్చి ఎక్కడైనా పోటీ చేసే సత్తా ఉందా అని విజయ్



ప్రశ్నించారు. జగన్ పులివెందులకు మాత్రమే పరిమితం అని విజయ్ ఎద్దేవా చేసారు. తెలుగుదేశం పార్టీకి సమర్థుడు అయిన నాయకుడు నారా లోకేష్ అని అన్నారు. ఆయన చేతుల్లోనే టీడీపీకి మంచి భవిష్యత్తు ఉందని విజయ్ అన్నారు. లోకేష్ నాయకత్వాన్ని ప్రతీ కార్యకర్త పూర్తి స్థాయిలో బలపరుస్తున్నారని కూడా విజయ్ చెప్పారు. లోకేష్ తన కుటుంబంగానే పార్టీలోని అందరినీ చూసుకుంటారు అని ఆయన తమ కుటుంబం మీద చూపించే అభిమానం ఆప్యాయతలు ఎంతో గొప్పవని అని విజయ్ చెప్పారు. ఇందుకు గానూ తాను లోకేష్ కి రుణపడి ఉంటాను అని విజయ్ చెప్పారు.టీడీపీ అధినేత చంద్రబాబు గురించి విజయ్ చెబుతూ ఆయనను నమ్ముకుంటే చాలు అందరికీ న్యాయం తప్పకుండా జరుగుతుందని అన్నారు. తాను మూడు సార్లు అనకాపల్లి ఎంపీ సీటు కోసం ప్రయత్నం చేశాను అని విజయ్ చెప్పారు. అయితే ఆ మూడు సార్లు నిరాశ ఎదురైంది అని అన్నారు. అయితే అదే సమయంలో చంద్రబాబు తనను పిలిచి నన్ను నమ్ము విజయ్ నీకు మంచి స్థానం ఇస్తాను అని చెప్పేవారు అని విజయ్ గుర్తు చేసుకున్నారు. ఇపుడు బాబు ఏకంగా తనకు రాజ్యసభ సీటు ఇచ్చి తన మాటను నిలబెట్టుకున్నారు అని బాబుకు సదా కృతజ్ఞతలు అని విజయ్ చెప్పారు. తమ కుటుంబానికి మొదటి నుంచి చంద్రబాబు ఆదరణ మద్దతు ఉందని విజయ్ చెప్పారు. తాను తెలుగుదేశం పార్టీకి జెండా కూలీగా పనిచేస్తాను అని విజయ్ చెప్పారు. పార్టీ ఆదేశాలు తుచ తప్పకుండా పాటిస్తాను అని ఆయన స్పష్టం చేశారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు ఏ అన్యాయం జరిగినా తాను ముందు ఉంటాను అని విజయ్ హామీ ఇచ్చారు. తాను పార్టీ కోసం ఎంతైనా చేసేందుకు సిద్ధమని ప్రకటించారు. నర్సీపట్నంలో అభివృద్ధి కార్యక్రమాలకు ఎంపీగా తన వంతుగా కష్టపడి పనిచేస్తాను అని విజయ్ చెప్పారు. నర్సీపట్నంలో సృష్టి క్షేత్రం పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవానికి ప్రధాని నరేంద్ర మోడీని ఆహ్వానిస్తామని విజయ్ తెలిపారు. సృష్టి క్షేత్రంలో ప్రపంచంలోనే ఎత్తైన పార్వతీపరమేశ్వరుల విగ్రహాలను నెలకొల్పుతామని విజయ్ చెప్పారు. నర్సీపట్నంలో అభివృద్ధి పనులకు ఎవరు ఆటంకం కలిగించినా సహించేది లేదని విజయ్ స్పష్టం చేశారు. మొత్తానికి చూస్తే అయ్యన్నపాత్రుడు వారసుడిగా విజయ్ సింహ గర్జన చేశారు. రానున్న రోజుల్లో అయ్యన్న ప్లేస్ లో పూర్తి స్థాయి రాజకీయానికి విజయ్ సిద్ధపడుతున్నారు అనడానికి తాజా సభ ఒక నిదర్శనంగా చెబుతున్నారు.

## కమలం వైపు నేతల చూపు

నెల్లూరు జూలై 3 ఏపీలోని అధికార, ప్రతిపక్ష పార్టీల్లోని కీలక నాయకులు కొందరు బీజేపీ వైపు చూస్తున్నారన్న చర్చ జోరుగా సాగుతోంది. వీరిలో అధికార పార్టీ ఎమ్మెల్యేలుగా , ఎంపీలుగా ఉన్న ఒకరిద్దరు నాయకుల పేర్లు కూడా తరచుగా వినిపిస్తున్నాయి. 'ఏమో.. వచ్చే ఎన్నికల నాటికి పరిస్థితులు ఎలా ఉంటాయో.. తప్పేముంది. ఈ పార్టీ కాకపోతే.. మరొకటి. నాకు సత్తా ఉంది. ఆ పార్టీకి చేర్చుకునేందుకు అవకాశం ఉంది.' అని క్షత్రియ సామాజిక వర్గానికి చెందిన ఓ కీలక నాయకుడు ఆఫ్ ది రికార్డుగా వ్యాఖ్యానించారు. ఇక, ఎంపీల విషయంలోనూ ఇదే తరహా వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఉమ్మడి కోస్తా జిల్లాల్లోని ఓ ఎంపీ గత ఎన్నికలకు ముందు చివరి నిమిషంలో టీడీపీ బీ ఫాం దక్కించుకున్నారు. కానీ, ఆయన పార్టీపరంగా కంటే.. జాతీయస్థాయి నేతలతోనే ఎక్కువగా టచ్‌లో ఉంటున్నారు. దీనికి కారణం.. అవసరమైతే.. వచ్చే ఎన్నికల్లో మార్పు కోసమేనని ఆయన చెబుతున్నారు. ఇది వినేందుకు చిత్రంగా ఉన్నా.. ఎవరికి వారు అప్పుడే కర్చీఫ్‌లు రెడీ చేసుకుంటున్నారు.ఇక, వైసీపీలోనూ కొందరు ఎమ్మెల్యేలు ఇదే బాటలో ఉన్నారన్న చర్చ కూడా ఉంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన ఓ




సీనియర్ నాయకుడు బీజేపీతో టచ్‌లోకి వెళ్లారు. అయితే.. ఆయన కీలక పదవిని ఆశించారని.. ఆ పదవి ఇచ్చే విషయంలో బీజేపీ వెనక్కి తగ్గడంతో ఆయన మౌనంగా ఉన్నారని వైసీపీలోనే చర్చ సాగుతోంది. ఇక, ఓ ఎంపీ అయితే.. నేరుగా బీజేపీ నేతలతోనే కలివిడిగా ఉంటున్నారు. ఢిల్లీలోనే ఎక్కువ సమయం గడిపేస్తున్నారు. బీజేపీ మంత్రుల కార్యాలయాల్లోనూ ఆయన కనిపిస్తున్నారు. ఎంపీగా పనులు చేయించుకునేందుకు వచ్చానని సదరు పార్లమెంటు సభ్యుడు సెలవిస్తున్నారు. అయితే.. ఇదంతా ఎందుకంటే.. అధికార పార్టీకి చెందిన నాయకుల్లో టికెట్ల బెంగ కనిపిస్తోంది. వారిపై చేయిస్తున్న సర్వేల్లో మార్కులు తగ్గడం... వచ్చే ఎన్నికల్లో టికెట్లు దక్కుతాయోలేదో నన్న బెంగ వెంటాడుతుండడంతో సదరు నేతలు ముందుగానే వచ్చే ఎన్నికలకు ప్రిపేర్ అవుతున్నారు. ఇక, వైసీపీ నాయకుల్లో వచ్చే ఎన్నికలపై పెద్దగా ఆశలు లేకుండా పోతున్నాయన్న వాదన ఉంది. ఏమో మళ్లీ విపక్షంలో కూర్చునే పరిస్థితి వస్తుందేమోనని వారు బెంగ పెట్టుకున్నారని అంటున్నారు. అందుకే కేసుల బెడద నుంచి తప్పించుకునేందుకు బీజేపీతో ముందుగానే టచ్‌లోకి వెళ్లిపోయారట.

## మావిగన్ అయితే... విశాఖ సంగతేంటీ

విశాఖపట్టణం జూలై 3, విశాఖ మన రాజధాని అని వైసీపీ అధినేత జగన్ గతంలో చెప్పారు. తాను 2024లో మరోసారి గెలిస్తే విశాఖ నుంచే ప్రమాణం చేస్తాను అని కూడా చెప్పారు. విశాఖలో అన్నీ ఉన్నాయి అది సహజసిద్ధమైన రాజధాని అని వైసీపీ నేతలు పలు మార్లు చెప్పుకొచ్చారు. అయితే 2024 ఎన్నికల్లో చేదు ఫలితాలు దక్కిన తరువాత కానీ వైసీపీ నేతలకు తత్వం బోధపడలేదని అంటున్నారు. అందుకే కొన్నాళ్ళ పాటు సైలెంట్ గా ఉండి ఇపుడు దాదాపుగా టీడీపీ రూట్లోనే వెళ్తున్నారు అని అంటున్నారు. టీడీపీ కూడా అమరావతి రాజధాని అన్నది. విజయవాడ గుంటూరులకు దూరంగా కొత్త నగరం నిర్మించే పనిలో టీడీపీ ఉంది. అయితే వైసీపీ మాత్రం రెడీ మేడ్ గా మావిగన్ అని అంటోంది. అంటే విశాఖకు బదులుగా మావిగన్ తెచ్చినా రెడీ మేడ్ సిటీ విషయంలో మాత్రం వైసీపీ పక్కకు జరగలేదు అన్నది స్పష్టం అవుతోంది. ఇక విశాఖ రాజధాని అన్నారు. బీచ్ రోడ్డులో రుషికొండ మీద టూరిజం రిసార్ట్స్ ని తొలగించి అక్కడ సీఎం క్యాంప్ ఆఫీసు అని నివాసం అని దాని పేరుతో భారీ భవనాలు కట్టారు. నాలుగు వందల కోట్ల రూపాయలు దాని కోసం ఖర్చు చేశారు. విశాఖలో సముద్రం ఉంది, రైల్ రోడ్డు ఎయిర్ కనెక్టివిటీ ఉందని కూడా చెప్పారు. ఉత్తరాంధ్రా వెనకబాటుతనం అంతా పోయేలా విశాఖ క్యాపిటల్ ద్వారా అభివృద్ధి సాగుతుందని కూడా ప్రకటించారు. కానీ ఇపుడు విశాఖను వెనక్కి తీసుకున్నారు. ఆశ పెట్టి తగ్గిపోయారు అని అంటున్నారు. మరి దీని మీద ఉత్తరాంధ్రా వైసీపీ నేతల రియాక్షన్ ఎలా ఉంటుంది అన్నది కూడా చర్చకు వస్తోంది. ఇక విశాఖ రాజధాని అన్నపుడు మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు వంటి వారు గట్టిగా సమర్ధించారు. మా ప్రాంతం బాగు పడవద్దా అని కూడా ప్రశ్నించారు. మాకు రాజధాని వస్తూంటే టీడీపీ నేతలు అడ్డుకుంటున్నారు అని కూడా విమర్శించారు. మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం అలాగే బొత్స సత్యనారాయణ వంటి వారు కూడా విశాఖ రాజధానికి జై కొట్టారు. మరి ఇపుడు వైసీపీ అయితే మావిగన్ అని తన రూట్ మార్చి ప్లేట్ తిప్పేసింది. దాంతో ఈ మాజీ మంత్రులు ఇంకా వైసీపీలోని కీలక నేతలు సీనియర్ నేతలు ఏమంటారు అని ప్రశ్నలు వస్తున్నాయి. అలాగే విశాఖ రాజధాని అని వైసీపీ నేతలు ఎంత గట్టిగా చెప్పినా మరెంత ఆర్భాటం చేసినా జనాల మద్దతు అయితే ఏ కోశానా లేదని తేలిపోయింది. విశాఖ రాజధాని అన్న తరువాతనే 2023లో ఉత్తరాంధ్రా ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగితే ప్రజలు యువత ఉద్యోగులు విద్యావంతులు అంతా కలసి టీడీపీకే ఓటేశారు. ఆ తరువాత 2024లో విశాఖ జిల్లా మొత్తం ఒక్క సీటూ వైసీపీకి లేకుండా చేశారు. ఇంతే కాదు గత అయిదేళ్లలో వైసీపీ విశాఖ రాజధాని అని ఎంతగా చెప్పినా జనాల నుంచి పాజిటివ్ రియాక్షన్ అయితే పెద్దగా రాలేదని గుర్తు చేస్తున్నారు. అందుకే వైసీపీ కూడా తన నిర్ణయం మార్చేసుకుంది అని అంటున్నారు. అయితే చెప్పుకోవడానికి ఈ రీజన్ బాగుంది కానె విశాఖ సహా ఉత్తరాంధ్రా అభివృద్ధి మీద వైసీపీ చిత్తశుద్ధి ఇంతేనా అన్న చర్చ కూడా మరో వైపు సాగుతోంది. మరి వైసీపీ ఏ విధంగా దీని మీద జనాలకు చెప్పుకుంటుందో చూడాల్సి ఉంది.

## లోకల్ బాడీ ఎలక్షన్స్ గురి...

విజయవాడ, జూలై 3, వైసీపీ అధినేత జగన్ పార్టీ నియోజకవర్గాల ఇంచార్జులు, మాజీ ఎమ్మెల్యేలతో భేటీ అవుతున్నారు. ఈ సందర్భంగా పార్టీపరంగా కొన్ని దిశానిర్దేశాలు చేస్తున్నారు. ఇదే సమయంలో స్థానిక ఎన్నికలకు సంబంధించి కూడా వారికి సూచనలు, సలహాలు ఇస్తున్నారు. ముఖ్యంగా గత ప్రభవం తిరిగి తీసుకురావాలన్నదే జగన్ లక్ష్యంగా కనిపిస్తోంది. అయితే.. ఇది సాధ్యమేనా? అనేది ప్రశ్న. ఎందుకంటే.. ఎవరు అధికారంలో ఉంటే వారే స్థానికంగా విజయం దక్కించుకునేందుకు ప్రయత్నాలు చేస్తారు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ అసలు పోటీ నుంచే తప్పుకొంది. అయినా.. కొందరు టీడీపీ నాయకులు పోటీ చేశారు. ఇక, ఇప్పుడు వైసీపీ స్థానికంలో అయినా.. గెలుపు గుర్రం ఎక్కి.. విజయం దక్కించుకుని గత ఎన్నికల్లో జరిగిన పరాభవం నుంచి బయట పడేందుకు ప్రయత్నాలు చేస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. కానీ, క్షేత్రస్థాయిలో కూటమి ప్రభుత్వంపై ఉన్న సానుకూలత వైసీపీకి కలసి వచ్చేలా లేదు. పింఛన్ల పంపిణీ నుంచి గ్రామీణ స్థాయిలో జరుగుతున్న అభివృద్ధి వంటివి వైసీపీకి వ్యతిరేకతను కొనసాగిస్తున్నాయి. నాడు వైసీపీ పనులు చేసి ఉంటే ఇప్పుడు చెప్పుకొనేందుకు అవకాశం ఉండేదని కూటమి నాయకులు కూడా వ్యాఖ్యానిస్తున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ ఈ ఎఫెక్ట్ ఎక్కువగా పడే ప్రభావం ఉందని అంటున్నారు. దీనికితోడు క్షేత్రస్థాయిలో నాయకుల మధ్య ఐక్యత కూడా కనిపించడం లేదు. జగన్ రావాలి.. పార్టీని పట్టించుకోవాలని అనే నాయకుల సంఖ్య ఎక్కువగా ఉందే తప్ప.. వ్యక్తిగతంగా బాధ్యత తీసుకుని ముందుకు సాగాలన్న లక్ష్యంతో నాయకులు ముందుకు కదలడం లేదు.మరోవైపు.. కూటమికి ఉన్న బలమైన వాయిస్ కూడా వైసీపీకి లేదనే చెప్పాలి. టీడీపీ, జనసేన అధినేతలు..తమ బలమైన గళంతో ప్రజల మధ్యకు వెళ్తుంటే.. వైసీపీ అధినేత మీడియా సమావేశాలకు.. చూసి చదువుతున్న స్క్రిప్టు లకు మాత్రమే పరిమితం అవుతున్నారు. ఇవన్నీ.. వైసీపీని ఇరకాటంలో నెడుతున్నాయి.

## నిమిషాంబ ఆశీస్సులతో గోళ్ళ రాజేష్‌కు ఘన సన్మానం--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 03-: నంద్యాల పట్టణంలోని చెరువుకట్ట వద్ద వెలసిన శ్రీ శ్రీ నిమిషాంబ దేవి ఆలయాన్ని ప్రముఖ వ్యాపారవేత్త, సామాజిక సేవకుడు గోళ్ళ రాజేష్ దర్శించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న గోళ్ళ రాజేష్‌కు ప్రధాన అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి వేదమంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక ఆశీర్వచనాలు అందించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించి అమ్మవారి ప్రసాదం, చిత్రపటాన్ని అందజేశారు. ఆలయ అభివృద్ధికి రూ. 5 లక్షల విరాళం అందించిన గోళ్ళ రాజేష్ సేవలను కొనియాడిన ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మహిళా భక్తులు సైతం ఆయనను తమ కుటుంబ సభ్యుడిగా భావించి పూలమాలలు, శాలువాలతో సత్కరించి అమ్మవారి గుర్తును బహుకరించారు. ఈ సందర్భంగా గోళ్ళ రాజేష్ మరిన్ని సేవా కార్యక్రమాలతో ప్రజలకు అండగా నిలవాలని ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు ఆకాంక్షిస్తూ అమ్మవారి ఆశీస్సులు అందజేశారు.

## ఎస్ఐఆర్ గడువు పెంచాలని ఎస్‌డీపీఐ వినతి--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 03: ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్?2026) కార్యక్రమం గడువును పొడిగించి, ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని కోరుతూ ఎస్‌డీపీఐ నంద్యాల అసెంబ్లీ నాయకులు ఎన్నికల అధికారి, డిప్యూటీ కలెక్టర్ శివప్రసాద్ రెడ్డి , అర్బన్ తహసీల్దార్ సత్య శ్రీనివాసులకు వినతిపత్రం అందజేశారు. ఎస్‌డీపీఐ అసెంబ్లీ అధ్యక్షుడు ఫాజిల్ దేశాయ్ మాట్లాడుతూ, నిరక్షరాస్యులు, వృద్ధులు, దివ్యాంగులు, రోజువారీ కూలీలు తదితర వర్గాల ప్రజలు దరఖాస్తు ప్రక్రియలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నందున గడువును పొడిగించాలని కోరారు. అలాగే గ్రామాలు, వార్డులు, సచివాలయాల్లో ప్రచార కార్యక్రమాలు నిర్వహించి ఎస్ఐఆర్‌పై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అత్తర్ హుస్సేన్, రిజ్వాన్ ఆలం, వి. హనీఫ్, షరీఫ్, సుహేల్ పాల్గొన్నారు.

## మహానంది పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 3:నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్ శుక్రవారం మహానంది పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని, ఫిర్యాదులపై సిబ్బంది స్పందన గురించి ఆరా తీశారు. స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, వివిధ కేసుల్లో స్వాధీనం చేసిన వాహనాల నిర్వహణను పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడికి తక్షణమే స్పందించి చట్టపరిధిలో న్యాయం చేయాలని, ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను సమర్థంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీలో నంద్యాల సబ్ డివిజన్ అదనపు ఎస్పీ కుమారి ఎం. జావళి ఐపీఎస్, తాలూకా రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



# ఓటరు సవరణపై సమీక్ష--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి , జూలై 03:ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని వేగవంతంగా, పారదర్శకంగా పూర్తి చేసి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎలక్షన్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శివప్రసాద్ రెడ్డి ఆదేశించారు. శుక్రవారం నంద్యాల తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం పురోగతిని ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. ఇంటింటి సర్వే, ఓటరు నమోదు, పేరు మార్పులు, చిరునామా సవరణలు, అభ్యంతరాల పరిష్కారం, పెండింగ్ దరఖాస్తుల పరిశీలన వంటి అంశాలపై అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తప్పనిసరిగా అమలు చేయాలని, ప్రతి దరఖాస్తును నిబంధనల మేరకు పరిశీలించి అర్హులైన ప్రతి ఓటరి పేరు జాబితాలో నమోదయ్యేలా చర్యలు చేపట్టాలని సూచించారు. నిర్దేశిత గడువులో సవరణ ప్రక్రియ పూర్తి చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సిబ్బంది పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో అవగాహన కల్పించాలని, ప్రతి అర్హుడూ ఓటరుగా నమోదు కావడానికి ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు. ఈ సమావేశంలో నంద్యాల అర్బన్ తహసీల్దార్ శ్రీనివాసులు, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ శేఖర్, రెవెన్యూ డిప్యూటీ తహసీల్దార్ రామ సంజీవ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తదితర అధికారులు పాల్గొన్నారు.



## నందమూరి నగర్‌లో క్షేత్రస్థాయిలో కమిషనర్ పర్యటన--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 3:నంద్యాల పట్టణంలో ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని వేగవంతం చేయాలనే లక్ష్యంతో మున్సిపల్ కమిషనర్ బి. శేషన్న శుక్రవారం 37, 38 వార్డుల్లో క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించారు. ఓటరు నమోదు, ఇంటింటి ధృవీకరణ ప్రక్రియ సక్రమంగా జరుగుతున్న తీరును పరిశీలిస్తూ అధికారులకు పలు సూచనలు చేశారు. 37వ వార్డులోని నందమూరి నగర్ ఎస్ఐఆర్ పీఎస్ నంబర్లు 25 నుంచి 30 వరకు, అలాగే 38వ వార్డులోని ఎస్ఐఆర్ పీఎస్ నంబర్లు 26 నుంచి 31 వరకు కమిషనర్ స్వయంగా సందర్శించి నిర్వహిస్తున్న సర్వే, ఫారాల సేకరణ, ఓటర్ల వివరాల నమోదు, ఇంటింటి ధృవీకరణ పనులను పరిశీలించారు. ప్రతి అర్హ ఓటరు వివరాలు తప్పులేకుండా నమోదు చేయాలని, ఎవరూ జాబితా నుంచి మినహాయించబడకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. ఓటర్లకు అవసరమైన అవగాహన కల్పిస్తూ, ప్రత్యేకించి కొత్తగా అర్హత పొందిన యువత, చిరునామా మారిన వారు, సవరణలు అవసరమైన వారు తప్పనిసరిగా నమోదు ప్రక్రియను పూర్తి చేసుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా, వేగవంతంగా ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని అధికారులకు కమిషనర్ స్పష్టం చేశారు. ఈ పర్యటనలో మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు విక్రమ్, శానిటేషన్ సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణ, శివప్రసాద్ రెడ్డి, మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎరువుల దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 03: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నంద్యాల మండలంలోని పలు ఎరువుల దుకాణాలను ఉప వ్యవసాయ సంచాలకులు గంగాధర్ రావు నేతృత్వంలోని బృందం శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేసింది. ఈ తనిఖీల్లో సహాయ వ్యవసాయ సంచాలకులు జయప్రకాశ్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి ప్రసాదరావు పాల్గొన్నారు. తనిఖీల్లో డిజిటల్ నమోదు విధానం ద్వారా ఎరువుల విక్రయాలు, నిల్వల నమోదు పుస్తకాలు, అమ్మకాల రశీదులు, భౌతిక నిల్వలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఉప వ్యవసాయ సంచాలకులు గంగాధర్ రావు మాట్లాడుతూ ఎరువులను గరిష్ఠ చిల్లర ధరకు మించి విక్రయించరాదని, పాత నిల్వలను పాత ధరలకే విక్రయించాలని, రైతులకు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలని సూచించారు. రోజువారీ నిల్వల వివరాలను నమోదు చేయడంతో పాటు అన్ని నమోదులు, నిల్వలు ఒకే విధంగా ఉండాలని తెలిపారు. కృత్రిమ కొరత సృష్టించడం, అధిక ధరలకు ఎరువులు విక్రయించడం వంటి అక్రమాలకు పాల్పడితే ఎరువుల నియంత్రణ నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు



## జిల్లా అభివృద్ధికి సోషల్ మీడియా తోడ్పాటు అవసరం--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 03: జిల్లా అభివృద్ధి, ప్రభుత్వ పథకాల ప్రచారంలో సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లు కీలక పాత్ర పోషించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. నంద్యాల జిల్లాలోని అహోబిలం, మహానంది, యాగంటి, శ్రీశైలం, నవనందులు వంటి ప్రముఖ పుణ్యక్షేత్రాలతో పాటు ఉద్యానవనం, సమీకృత వ్యవసాయం, పీఎం సూర్యఘర్ పథకం, స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులు, నల్లమల తేనె, మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్లు, జిల్లాలోని పారిశ్రామిక అభివృద్ధి వంటి అంశాలను సోషల్ మీడియా ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అలాగే స్వర్ణాంధ్ర?స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంపై విస్తృత అవగాహన కల్పించి పరిశుభ్రతను ప్రతి ఒక్కరి జీవనశైలిగా మార్చేలా ప్రచారం చేయాలని కోరారు. నంద్యాల జిల్లా అభివృద్ధి, ప్రత్యేకతలను రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు పొందేలా సోషల్ మీడియా వేదికలను సమర్థంగా వినియోగించాలని కలెక్టర్ సూచించారు.



## ఆదివారం లయన్స్ క్లబ్ ప్రమాణ స్వీకారం--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 03- నంద్యాల లయన్స్ క్లబ్ 2026?27 నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం రామకృష్ణ పీజీ కళాశాలలో నిర్వహించనున్నారు. అధ్యక్షుడిగా ముదియనూర్ సందీప్ కుమార్, కార్యదర్శిగా మేడా చంద్రశేఖర్, కోశాధికారిగా సురేష్‌తో పాటు నూతన కార్యవర్గ సభ్యులతో లయన్స్ జిల్లా వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ రవి కృష్ణ ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. ఈ కార్యక్రమానికి రామకృష్ణ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి, శ్రీ గురు రాఘవేంద్ర విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ దస్తగిరి రెడ్డి, ప్రముఖ న్యాయవాది వెదుర్ల రామచంద్రరావు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. శుక్రవారం లయన్స్ క్లబ్ కార్యాలయంలో ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ, 1970లో స్థాపించబడిన నంద్యాల లయన్స్ క్లబ్ గత 56 ఏళ్లుగా నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు విశేష సేవలందిస్తోందన్నారు. నూతన కార్యవర్గం ఆధ్వర్యంలో కూడా సామాజిక సేవా కార్యక్రమాలు మరింత విస్తృతంగా కొనసాగనున్నట్లు నూతన ప్రతినిధులు తెలిపారు.

## మహానందిలో ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించిన కలెక్టర్--

### ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు---



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి , జూలై 3:"వన్ మంత్?ఫోర్ విజిట్" కార్యక్రమంలో భాగంగా మహానంది మండలం కమ్మసత్రంలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో పరిశీలించి, సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అర్జీల పరిష్కార పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తామని, ప్రజలకు రసీదులు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ స్థాయిలో ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించడం వల్ల ప్రజలకు మరింత చేరువగా సేవలు అందుతున్నాయని తెలిపారు. మండల స్థాయిలో పరిష్కరించగల సమస్యలను అక్కడికక్కడే, మిగిలిన వాటిని జిల్లా, రాష్ట్ర స్థాయిలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో భూమి వివాదాలు, గృహ మంజూరు, రెవెన్యూ సమస్యలు తదితర అంశాలపై ప్రజలు వినతులు సమర్పించగా, వాటిపై తక్షణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సునీల్ షేరాన్, జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, ఆర్డీవో విశ్వనాథ్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## స్వర్ణ గ్రామం పేరుమార్పు కాగితాలకేనా

--విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 03:ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థకు "స్వర్ణ గ్రామం ? స్వర్ణ వార్డు" పేరును ప్రకటించినప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం ఆ మార్పు పూర్తిగా అమలులోకి రాకపోవడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన గ్రామ, వార్డు సచివాలయాల పేర్లను కూటమి ప్రభుత్వం ఇటీవల ×"స్వర్ణ గ్రామం ? స్వర్ణ వార్డు"×గా మారుస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే అనేక ప్రాంతాల్లో ఇప్పటికీ కార్యాలయాల బోర్డులు, అధికారిక రికార్డులు, సూచిక ఫలకాలు, ఇతర గుర్తింపుల్లో పాత పేర్లే కొనసాగుతున్నాయని ప్రజలు పేర్కొంటున్నారు. ప్రభుత్వం పేరుమార్పుపై ప్రకటనలు చేసినప్పటికీ, కింది స్థాయి అధికారులు వాటిని అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో ప్రజలు ఏది అధికారిక పేరు అనే విషయంలో అయోమయానికి గురవుతున్నారని అంటున్నారు. ప్రభుత్వ నిర్ణయాలు కేవలం పత్రికా ప్రకటనలకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలోనూ పూర్తిస్థాయిలో అమలు కావాలని ప్రజలు కోరుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని స్వర్ణ గ్రామం ? స్వర్ణ వార్డు కార్యాలయాల్లో కొత్త పేర్లతో బోర్డులు ఏర్పాటు చేసి, అధికారిక రికార్డులు కూడా వెంటనే నవీకరించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తున్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**